www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 7 మే 2025
5
అన్నమయ్య



చిన్ననాటి బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని స్థానిక బస్టాండ్ కూడలిలో వెంకటరమణ నాయీ బ్రాహ్మణ వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల అతనికి గుండెపోటు రావడంతో హార్ట్ కి స్టంట్ వేశారు. విషయం తెలుసుకున్న చిన్ననాటి బాల్యమిత్రులు వల్లె మాధవి, అల్లం అశోక్ కుమార్, బోనాసి నరసింహులు, శ్రీధర్, ఆనాల నరసమ్మ, నాగ సుబ్బయ్య, గులాం, కట్టా సుబ్బన్న, తదితర స్నేహితులు కలిసి రూ.50 వేలు వెంకటరమణ ఆరోగ్య అవసరానికి ఉపయోగించుకోవాలని అందజేశారు. బాల్య స్నేహానికి విలువ ఉందని ఆనాటి బాల్యమిత్రులు చాటి చెప్పారు. మానవసేవే మాధవసేవ అన్న రీతిలో వీరు స్నేహితునికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.



మిత్రునికి ఆర్థిక సాయం చేస్తున్న బాల్యమిత్రులు

టిడిపిలో 'స్థానిక' వేడి!

- మహానాడులోపే కసరత్తు
- 20లోపు మండల కమిటీల ఏర్పాటు
- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సిఎం చంద్రబాబు



టిడిపిలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి పెరుగుతోంది. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన ఏడాది అవుతున్న నేపథ్యంలో సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి సారించింది. కడప, అన్నమయ్య జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడానికి కసరత్తు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో పీలేరు, రైల్వేకోడూరు, మైదుకూరు, ప్రొద్దుటూరు మినహా మిగిలిన చోట్ల ఆధిపత్య పోరు పతాక స్థాయిలో ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కోసం నాయకులు కలిసికట్టుగా కృషిచేసి అద్భుత ఫలితాలను రాబట్టారు. పలు నియోజకవర్గాల్లో ఆధిపత్య పోరుకు తెరలేచింది. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో కడపలో ప్రతిష్టాత్మకంగా టిడిపి మహానాడు నిర్వహణకు సంకల్పించింది. ఈ నెల 20 నాటికి ఆయా నియోజకవర్గ, మండల కమిటీ ఎంపికను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల నేపథ్యంలో టిడిపి నియోజకవర్గ నాయకత్వం స్థానిక కమిటీల ఏర్పాటుపై దృష్టి సారించిన నేపథ్యంలో కథనం..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టిడిపిలో స్థానిక సంస్థల వేడి మొదలైంది. కడప జిల్లాలో ఈ నెల 27, 28, 29వ తేదీల్లో మహానాడు నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేపట్టింది. పలువురు రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితతో కలిసి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సభావేదిక ఏర్పాటు స్థలం ఖరారుకు కసరత్తు చేసింది. రెండ్రోజుల కిందట చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురం సమీపంలోని స్థలంలో ఏర్పాటుకు మొగ్గు చూపింది. మహానాడు ఆనవాయితీ ప్రకారం నిర్వహణకు ముందే స్థానిక కమిటీలను నియమించాల్సి ఉంది. ముఖ్యమంత్రి ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన 66 మండలాలకు కమిటీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. కడప జిల్లాలో మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, అన్నమయ్య జిల్లాలో పీలేరు, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో మినహా మిగిలిన ఎనిమిది నియోజక వర్గాల్లో ఆధిపత్య పోరు, అంతర్యుద్ధాలను తలపించే స్థాయిలో ఉంది. పులివెందుల నియోజకవర్గ టిడిపి నాయకత్వం ఇన్‌ఛార్జి మంత్రి ఎదుటే ఇరువురు నాయకుల అనుచరులు బాహాబాహీకి దిగిన సంగతి తెలిసిందే. ఇలాంటి పరిస్థితే కడప మొదలు ఇతర నియోజకవర్గాల్లోనూ కనిపిస్తోంది. రాజంపేట నియోజకవర్గంలో అయితే పరిస్థితి తీవ్రత పతాక స్థాయికి చేరుకున్న సంగతి తెలిసిందే. అవకాశం దొరికినప్పుడల్లా పరస్పరం అధిష్టానానికి ఫిర్యాదులు చేసుకోవడం పరిపాటిగా మారింది. నియోజకవర్గాల బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యేలకు మండల కమిటీలను నియమించడం కత్తి మీద సాములా తలపించనుంది. స్థానిక కమిటీల ఏర్పాటు వ్యవహారం బాధ్యతల్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు ఇవ్వడంతో ఏకపక్ష నియామకాలకు అవకాశం ఉంది. వివాదాలు తారాస్థాయికి చేరుకునే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. అసమ్మతుల ప్రభావం అతి సమీపంలో రానున్న స్థానిక సంస్థల పంచాయతీలు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు.

ఈ నెల 20 నాటికి స్థానిక కమిటీలను ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన టిడిపి నాయకత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో కూటమి సర్కారు సుమారు ఏడాదిగా అధికారంలో కొనసాగుతోంది. తమ గెలుపునకు సహకరించిన స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిల పట్ల ఉన్నప్పటికీ మారిన వ్యతిరేక గ్రూపులు అధిష్టానానికి ఫిర్యాదుల పర్వం కొనసాగిస్తున్న నేపథ్యం అందరికీ తెలిసిందే. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జి నియామకాల పట్ల స్పష్టత లేకపోవడంతో గందరగోళ వాతావరణం కనిపిస్తోంది. కడపలో ఎమ్మెల్యే మాధవి, పులివెందులలో బిటెక్ రవి, జమ్మలమడుగులో భూపేష్‌రెడ్డి, అన్నమయ్య జిల్లాలో రాయచోటిలో మంత్రి మండిపల్లి, పీలేరులో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, మదనపల్లిలో షాజహాన్‌బాషా, తంబళ్లపల్లి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండల కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని బలోపేతం చేయాల్సి ఉంది. కడప, అన్నమయ్య జిల్లాల్లో ఆధిపత్య పోరును అధిగమించి, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసు కోవడంపైనే పార్టీ భవిష్యత్ ఆధారపడి ఉంటుందనే వాదన వినిపిస్తోంది.

మాజీ ఎంపీ పాలకొండ్రాయుడు కన్నుమూత

- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, టిడిపి కార్యకర్తలు
- నేడు రాయచోటికి రానున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, మంత్రులు
- పలువురు నాయకుల సంతాపం



ప్రజాశక్తి -రాయచోటి

తెలుగుదేశం పార్టీలో విషాదం చోటు చేసుకుంది.తెలుగు దేశం పార్టీ మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాల కొండ్రాయుడు (78) మంగళ వారం తెల్లవారు జామున కన్నుమూశారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి అంటే రాయుడు, రాయుడు అంటే టిడిపి అనేలా ఆయన రాజకీయ ప్రస్థానం సాగింది. ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. ఆయన మరణంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగి పోయారు. పాలకొండ్రాయుడు మరణ వార్త విన్న వెంటనే రాష్ట్రం, జిల్లాలోని పలువురు ప్రముఖ నాయకులు సుగవాసి బ్రదర్స్‌కు ఫోన్ ద్వారా తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పాలకొండ్రాయుడుకు ఇద్దరు కుమారులు బాలసుబ్రమణ్యం, ప్రసాద్ బాబుతో పాటు కుమార్తె ఉన్నారు. ఆయన కుమారులు సుగవాసి ప్రసాద్ బాబు, బాలసుబ్రమణ్యం ప్రస్తుతం టిడిపిలో కొనసాగుతున్నారు. చాలా కాలం నుంచే పాలకొండ్రాయుడు రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

సుగువాసి రాజకీయ ప్రస్థానం

పాలకొండ్రాయుడు రాయచోటి ఎమ్మెల్యేగా నాలుగు సార్లు, రాజంపేట ఎంపీగా ఒక్కసారి పని చేశారు. 1978లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి తొలి సారిగా జనతా పార్టీ తరపున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి మహల్ హబీబుల్లాపై విజయం సాధించారు. 1983లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కీ.శే.మాజీ ఎమ్మెల్యే మహల్ హబీబుల్లా సతీమణి మహల్ షవరున్నిసాపై విజయం సాధించారు. అనంతరం ఎన్‌టిఆర్ టిడిపి పార్టీ స్థాపించి టిడిపిలోకి ఆహ్వానించడంతో పాల కొండ్రాయుడు టిడిపిలో చేరి 1984లో రాజంపేట పార్లమెంటు స్థానానికి పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి సాయి ప్రతాప్‌పై విజయం సాధించారు. 1990లో కాంగ్రెస్ అభ్యర్థి మండిపల్లి నాగిరెడ్డిపై పోటి చేసి తొలిసారి ఓటమి పాలయ్యారు. 1992లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో మండిపల్లి నారాయణ రెడ్డిపై పోటీచేసి ఓటమి పాలయ్యారు. 1994లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 1999లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి మండిపల్లి నారాయణరెడ్డిపై పోటీ చేసి విజయం సాధించారు. 2004లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మార్చి శ్రీలత రెడ్డికు టికెట్ ఇవ్వడంతో ఆమెపై సైతం పాలకొండ్రాయుడు విజయం సాధించారు. 2009లో గడికోట శ్రీకాంత్‌రెడ్డిపై పోటు చేసి ఓటమి పాలయ్యారు. 31 ఏళ్ల తన రాజకీయ ప్రస్థానంలో 8 దఫాలు ఎమ్మెల్యేగా పోటి చేసి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలు పొందారు. రాజంపేట పార్లమెంట్ స్థానానికి రెండు దఫాలు పోటీ చేసి ఒక సారి ఎంపీగా విజయం సాధించారు. వైసిపి ఆవిర్భావం తర్వాత ఆయన రాజకీ యాలకు దూరంగా ఉన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు గౌతమ్ థియేటర్ వద్ద అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

పలువురు నాయకులు సంతాపం: టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస్ రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, హరిప్రసాద్, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, నియోజకవర్గంలోని పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాలకొండ్రాయుడు పార్థవ దేహాన్ని సందర్శించి సంతాపం తెలిపి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు రాయచోటికి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు రాక : పాలకొండ్రాయుడు మృతికి టిడిపి పార్టీ తరపున పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, జిలా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలతో కలిసి బుధవారం ఉదయం రాయచోటి పట్టణంలోని గాలివీడు మార్గంలోని టిడిపి కార్యాలయంలో ఉంచిన పాలకొండ్రాయుడు పార్థవ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించనున్నారు.

ఆదర్శ నాయకుడు : గడికోట మోహన్‌రెడ్డి

ఆదర్శనాయకుడు సుగవాసి పాలకొండ్రాయుడు అని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. పాలకొండ్రాయుడు పార్థీవ దేహాన్ని మోహన్ రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. వారి మృతిపట్ల సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులును పరామర్శించారు.

రాజకీయ చతురత కలిగిన నేత రాయుడు : సిపిఎం

రాజకీయ చతురత కల్గిన పేదల పక్షపాతి సుగవాసి పాలకొండ రాయుడు అని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. సుగావాసి పాలకొండ రాయుడు మరణించడం పట్ల సిపిఎం జిల్లా కమిటీ తరపున సంతాపం ప్రకటించారు.

'ముదివేడు' నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

- వ్య.కా.స రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ బుధవారం విజయవాడలోని సిసిఎల్ఎ కార్యాలయం ముందు జరుగు ధర్నాకు నిర్వాసిత రైతులు మంగళవారం విజయవాడకు వెళ్లే రైలులో బయలుదేరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కురబలకోట మండలంలో ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించ తలపెట్టి బి.కొత్తకోట మండలంలోని కోటవూరు గ్రామం, కురబలకోట మండలంలోని కురబలకోట, ముదివేడు, పిచ్చలవాండ్లపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో 765.1235 ఎకరాల భూమిని ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా, బలవంతంగా లాక్కున్నదన్నారు. దాదాపు 300 మంది రైతులు నిర్వాశితులు అయ్యారని, దిగువసీతివారిపల్లి, కొత్తపల్లి, చౌటకుంటపల్లి, దిన్నమీదపల్లి గ్రామాలు పూర్తిగా మునిగిపోతున్నా పునరావాసం గాని, నష్టపరిహారం గానీ చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాడిన ఫలితంగా రూ.107.46 కోట్లు నష్టపరిహారం చెల్లిస్తామని హామి ఇచ్చారని గుర్తు చేశారు. అనేక పోరాటం ఫలితంగా దాదాపు 300 మంది రైతులకు నష్టపరిహారం రూ.7 కోట్లు రావాల్సి ఉండగా కేవలం 22 మంది రైతులకు రూ.1.65 కోట్ల నష్టపరిహారం కూటమి ప్రభుత్వం విడుదల చేయడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని మిగిలిన రైతులకు నష్టపరిహారం చెల్లించడంతో పాటు, పునరావాసం కల్పించాలని, భూమి లేని వ్యవసాయ కూలీలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్వాసిత రైతులు రాజేష్, శ్రీనివాసులు, గంగరాజు, రెడ్డెప్ప, లక్ష్మీదేవి, రమణమ్మ, గణేష్, హరీష్ పాల్గొన్నారు.



విజయవాడ ధర్నాకు బయలుదేరిన భూ నిర్వాసిత రైతులు



నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు రెండవ రోజు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలు రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పురపాలక కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జనాభా అధికమైన ప్రాంతాలలో కార్మికులను నియమించాలని, 60 సంవత్సరాలు దాటిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ వసతి కల్పించాలని, ఇఎస్ఐ ఇంతవరకు అమలు కాకపోవడం చాలా దారుణమని అన్నారు. రాజంపేట పురపాలికలో తక్కువ మంది కార్మికులతో ఇష్టారాజ్యంగా పనులు చేయించుకుంటున్నారని, ఇప్పటికైనా పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకొని సరిపడా కార్మికులను నియమించి పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి రమణ, కార్మికులు రవిశంకర్, పండు పాల్గొన్నారు.

గాలీటమ్మకు పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి -గాలివీడు: వీరబల్లి వాస్తవ్యులు గాలివీటి విజయభాస్కరరెడ్డి కుటుంబ సభ్యులు మంగళవారం సాయంత్రం పిల్లనగ్రోవులు, డప్పు వాయిద్యాలతో నల్లమందు పేల్చుకుంటూ గేటు వద్దకు ఊరేగింపు నిర్వహించారు. అక్కడ గాలిటమ్మకు పట్టు వస్త్రాల సమర్పించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపిపి మిట్టపల్లి యదుభుషణరెడ్డి, మాజీ ఎంపిపి అరుణమ్మ, సర్పంచ్ మిట్టపల్లి, లక్ష్మీదేవి, గోపికృష్ణారెడ్డి, హేమకుమార్ రెడ్డి, మహేష్ బాబు, సూరి, విశ్వనాధరెడ్డి, నరసారెడ్డి,శివారెడ్డి, ఇంద్రసేనరెడ్డి ప్రజలు పాల్గొన్నారు. ఊరేగింపుకు హాజరైన ప్రజలందరికీ పప్పిరెడ్డి. మహేశ్వర్ రెడ్డి భోజన వసతిని ఏర్పాటు చేశారు.

పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలి

ప్రజాశక్తి-పీలేరు : ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందని సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయితీ కార్యాలయ సమావేశ భవనంలో 5వ వార్డు సచివాలయ సిబ్బందితో సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, ఇఒ గురు మోహన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న ప్రతి పౌరునికి ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అందించే బాధ్యత సచివాలయ సిబ్బందే అని అన్నారు. ఇటీవల తలెత్తుతున్న సైబర్ మోసాలపై గ్రామ ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం కూడా ఉందని చెప్పారు. ప్రజల వ్యక్తిగత సమాచార విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, లింకులకు స్పందించకూడదని సూచించారు. సమావేశంలో వార్డు సభ్యులు ఆబిద్, మలికార్జునరెడ్డి, విక్టరీ వెంకట్రమణారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, సాంబశివ రెడ్డి, నాగభూషణం, కాలేషా, సచిన్ (ఖాదర్), పరమేష్, 5వ సచివాలయ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ సహాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

రూ.6 లక్షల పరిహారమిస్తేనే భూములిస్తాం

- సోలార్ నిర్వాసితులు వెల్లడి

ప్రజాశక్తి-గాలివీడు

సోలార్ కింద ముంపునకు గురయ్యే భూములకు ఎకరాకు రూ. 6 లక్షలు ఇవ్వాలని సోలార్‌ప్లాంట్ నిర్వాసితులు పేర్కొన్నారు. జెసి కలెక్టర్ రూ.3 లక్షల 70 ఇస్తామని తెలుపగా నిర్వాసితులు అంగీకరించలేదు. మంగళవారం ఎంపిడిఒ సభాభవనంలో మంగళవారం సాయంత్రం తూముకుంట సోలార్‌కు వెళ్లే భూ బాధితులతో అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ అదర్శ రాజేంద్రన్ పరిహారం నిర్ణయం కోసం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బాధితులు ఎకరాకు ఆరు లక్షలు ఇస్తే భూములు సోలార్ ఇస్తామని లేకపోతే ఇవ్వమని తేల్చి చెప్పారు. జాయింట్ కలెక్టర్ బాధితులతో మాట్లాడుతూ రూ. 3.70 లక్షలకు అంగీకరించాలని కోరారు. కానీ సోలార్ భూ బాధితులు జెసి ఆదేశాలను అంగీకరించలేదు 400 ఎకరాలు భూమి సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి అవసరం కాగా అందులో 60 ఎకరాల భూమి సాగులో ఉంది. 54 ఎకరాల భూమి పట్టా భూమి ఉంది. మిగతా భూమంతా ప్రభుత్వ భూమి అయితే, బాదితులు మాత్రం ఆ ప్రభుత్వ భూమి లోనే వ్యవసాయం చేసుకుంటున్నారు. న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరారు. సమావేశంలో ఆర్‌డిఒ ఎస్. శ్రీనివాసులు, తహశీల్దార్ జె. భాగ్యలత, డిటి సురేంద్రరెడ్డి, ఆర్ఐ, బాలాజీ, విఆర్‌ఒ ఏసుదాసు, గ్రామ సర్పంచ్ రవికుమార్ నాయుడు, మాజీ సర్పంచ్ బద్రప్పనాయుడు, కదిరి రెడ్డి, ఎమ్మెస్, మహబూబ్ బాషా,ప్రకాష్ నగర్ కాలనీ ప్రజలు తూముకుంట ప్రజలు పాల్గొన్నారు.

బిసి మహిళలకు కుట్టు మిషన్ల పేరుతో మోసం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిసి మహిళలను పావులుగా వాడుకుని కుట్టుమిషన్ల పంపిణీ పేరుతో దాదాపు రూ.150 కోట్లు దోచుకోవడానికి కూటమి ప్రభుత్వ నాయకులు సిద్ధమయ్యారని మదనపల్లె టౌన్ బిసిసెల్ అధ్యక్షులు ఆవుల విశ్వనాథ్ ఆరోపించారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవమైన మార్చి 8న మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించి, ఆ పనులు ప్రారంభించక ముందే దోపిడీకి మాత్రం తలుపులు బార్లా తెరిచినట్లు కనిపిస్తోందన్నారు. 1,02,832 మంది మహిళలకు శిక్షణకోసం రూ.221.08 కోట్లు కేటాయించారని ఇందులో ఒక్కో మిషన్‌కు రూ.4,300, ఒక్కో మహిళకు శిక్షణ కోసం రూ.3 వేల చొప్పున ఖర్చు చేస్తున్నామని చెప్పారన్నారు. ఈ విధంగా అయ్యే ఖర్చు రూ.750 కోట్లు మాత్రమే కాగా మిగిలిన రూ.150 కోట్లకు లెక్కలు లేవన్నారు. ఒక్కో లబ్ధిదారుని పేరిట దాదాపు రూ.16వేల వరకు దోపిడీకి పాల్పడుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా పూర్తిస్థాయిలో కుట్టు శిక్షణ ప్రారంభం కాకపోయినా నీకింత.. నాకింత.. అనే సిద్ధాంతం ప్రకారం మొబిలైజేషన్ అడ్వాన్సు కింద కాంట్రాక్టర్లకు రూ.25 కోట్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమవుతోందని తెలిపారు. గతంలోనూ ఆదరణ పథకం కింద మిషన్ల పంపిణీ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం మహిళలను వంచించిందని గుర్తు చేశారు. వెంటనే దీనిని పునఃసమీక్షించి ప్రజాధనం వృధా కాకుండా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బిసి నాయకులు మజ్జిగ కేశవ యాదవ్, వినుతాభాయి, మేరీ, అపర్ణ, నాగమని, శ్యామల పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** బిసిల పేరు చెప్పి.. కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయలు లూటీ చేస్తోందని పీలేరు నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు నీళ్లభాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పులిశివారెడ్డితో కలసి ఆయన మాట్లాడుతూ బిసిలకు అందాల్సిన కుట్టు మిషన్లను ఆసరా చేసుకొని వందల కోట్ల రూపాయలు దండుకోవడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆనంద, మహేష్, రాయదుర్గం శివ, రాజాబాబు, గాంధీపేట రఘు, బిడ్డల కేశవరెడ్డి, మునిభాస్కర, చంద్రశేఖర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి-చిన్నమండెం: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటమోహన్ అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో అగ్రికల్చర్, హార్టికల్చర్, వెలుగు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టుల సమన్వయంతో రైతులలో అవగాహన పెంపొందించేందుకు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నుముకని, ప్రకృతి ఆధారిత వ్యవసాయమే మన భవిష్యత్ అని, రసాయనాల వాడకాన్ని తగ్గించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయాలని పేర్కొన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలను ఒక లక్ష్యంతో వ్యవసాయం చేస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి గీత మాట్లాడుతూ ప్రతి ఇంట్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని, కంపోస్ట్ తయారీ గ్రామస్థాయిలో అభివృద్ధి చేయాలని సూచించారు. హార్టికల్చర్ ఆఫీసర్ వనిత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలి సాధ్యమవుతుందని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. వెలుగు ఎపిఎం రెడ్డమ్మ మాట్లాడుతూ వ్యవసాయ, తోటలశాఖల, వెలుగు మరియు ప్రకృతి వ్యవసాయ సంస్థలు సమన్వయంతో పనిచేసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి రైతు పాటించే విధంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఎంటిఎల్ చందు, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ పద్మావతి మాట్లాడారు. అనంతరం ఉత్తమ ప్రకృతి వ్యవసాయ రైతులు చంద్రమోహన్ గారిని, రవణమ్మ గారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్, హార్టికల్చర్, వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన వృక్షం.. ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి - పుల్లంపేట: మండలంలోని సీతారాంపేట గ్రామ సమీపంలో కడప రేణిగుంట జాతీయ రహదారిపై మంగళవారం వీచిన పెనుగాలులకు భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా నేల కూలింది. దీంతో సుమారు రెండు గంటలసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ తన సిబ్బందితో వెళ్లి కూలీన భారీ వృక్షాన్ని జెసిపితో తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. భారీ వృక్షం కూలే సమయంలో వాహనాలు గాని, మనుషులు గాని లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వర్షాలు కురుస్తున్న సమయంలో మను షులు ఉండవద్దని ఎస్ఐ మండల ప్రజలకు తెలియజేశారు.



కూలిన భారీ వృక్షాన్ని జెసిబితో తొలగిస్తున్న పోలీసులు



ప్రతిభ పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కార్మికుల కుటుంబాలలో విద్యా కుసుమాలు వికసించడం సంతోషంగా ఉందని కురవంక పంచాయతీ సర్పంచ్ పసుపు లేటి చలపతి, ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బేబీ వెల్కమ్ హోంలో నవ జీవన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేశారు. నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ జి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కురవంక గ్రామ పంచాయతీ సర్పంచ్ పసుపు లేటి చలపతి, ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి, బివైఎస్ పునిత్, సొసైటీ అధ్యక్షులు పద్మావతమ్మ, కోశాధికారి కృష్ణ పూజిత, హెల్పింగ్ మైండ్స్ అధ్యక్షులు అబు బక్కర్ సిద్ధిక్, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలాలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన తేజశ్వని, చాయా కృష్ణ, మౌనిక, ఆయేషా, పదవ తరగతిలో కార్మిక కుటుంబాల నుంచి రాణించిన ఆణిముత్యాలు నవ్యతేజ్, తారక్, వినయ్ కుమార్, గురు చరణ్, గణేష్, పల్లవి, లహరి, దినేష్, సాయి తేజ, నలినిలకు జ్ఞాపిక, కాలేజ్ బ్యాగ్, నోట్ బుక్స్ పెన్నులు, డిక్షనరీలను అందజేశారు. కార్యక్రమంలో చంద్రమోహన్, చంద్రశేఖర్, విద్యార్థులు, వారి తల్లి తండ్రులు పాల్గొన్నారు.

గుండె పోటుతో ఆర్‌టిసి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్/రాయచోటి టౌన్



రామచంద్ర (ఫైల్ ఫొటో)

రాజంపేట ఆర్‌టిసి డిపో డ్రైవర్ రామచంద్ర (43) రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. రాజంపేట నుంచి రాయచోటి చేరుకున్న ఆర్‌టిసి బస్సును బస్టాండ్ పాయింట్ లో పెట్టి అల్పాహారం తిన్న అనంతరం మంచినీరు పట్టుకోవడానికి బస్టాండ్‌లోని రెండవ అంతస్థు లోకి వెళ్లిన డ్రైవర్ చంద్ర గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. రాజంపేట మండలం పోలి గ్రామానికి చెందిన రామచంద్రకు భార్య, కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోలి గ్రామంలోని తన స్వగృహానికి తరలించారు. ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికులు రామచంద్ర మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న బిఎస్‌పి నాయకులు

బహుజన సంకల్ప సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బుధవారం నిర్వహించే బహుజన సంకల్ప సభను విజయవంతం చేయాలని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు అబ్బవరం యుగంధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు మాయావతి ఆదేశాలతో రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బహుజన సంకల్ప సభలను నిర్వహించబోతున్నారు అన్నారు. హిందూపురంలో ప్రారంభమైన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహిస్తారని చెప్పారు. బహుజనులు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ముస్లిం, అణగారిన అగ్రకుల పేదలు అందరూ విచ్చేసి సభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం బహుజన సంకల్ప సభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేయడం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెదవీటి నరసింహులు పాల్గొన్నారు.



దాణా పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

పాడి రైతులకు పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె

ప్రాంతీయ పశువైద్యశాలలో మంగళవారం పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ, పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రోహిణి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న 50 శాతం సబ్సిడీతో పాడి రైతులకు పశువుల దాణా లభిస్తున్నదని తెలిపారు. దారిద్ర రేఖ దిగువన ఉన్న ప్రతి పాడి రైతు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. పాడి పశువులు కలిగిన రైతులు పశు బీమా వంటి సదుపాయాలను కూడా వినియోగించుకోవడం ద్వారా ఊహించని పరిస్థితుల్లో ఆర్థిక భద్రతను పొందవచ్చని సూచించారు. పశువుల సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు రైతు ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో వెటనరీ సిబ్బంది నరసింహారెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్: గూడెంచెరువులోని టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇవ్వాలని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం వివిధ ప్రదేశాల్లో పర్యటించారు. ముందుగా ఈ నెల 17న నారాపురం వెంకటేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. స్వామి వారిని దర్శించుకున్నారు. జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుపై ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రఫిక్ పాషా ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితం

ప్రజాశక్తి - ముద్దనూరు: ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితమని పిహెచ్‌సి వైద్యాధికారులు శ్రీకాంత్, నాగార్జున పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా నోడల్ అధికారి శోభకుమారి అధ్యక్షతన ఆశా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. గర్భిణులను గుర్తించి వారి వివరాలు వంద శాతం నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించేలా అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. ప్రతి నెల నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్‌సిడి, సిడి సర్వే వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటిస్తూ గర్భిణులను గుర్తించి ఎఎన్‌సిలకు పూర్తి సమాచారం అందించాలన్నారు. అర్హత కలిగిన దంపతులను గుర్తించి ట్రాకింగ్ పూర్తి చేయాలన్నారు. చిన్న పిల్లలను గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు విటమిన్ ఎ సిరప్ అందించాలన్నారు. హెచ్‌ఐవిఎస్, విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డేస్, విలేజ్ హెల్త్ శానిటేషన్ కార్యక్రమాల్లో తప్పక పాల్గొని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, స్టాఫ్ నర్స్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రేషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్: ప్రతి ఇంటికీ రేషన్ పంపిణీ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పులివెందుల వైసిపి పట్టణ అధ్యక్షుడు వర్ల్పపల్లి కిషోర్, ఆర్టీఎ వింగ్ అధ్యక్షులు మారుతి రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు కార్తిక్, విద్యార్థి విభాగం అధ్యక్షులు పోరెడ్డి ఇశ్వంతోర్రెడ్డి సూచించారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే బియ్యం పొందాలంటే కూలి పనులు మానుకోవాల్సి వస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వారి ఇంటి వద్దకే వెళ్లి ఎండియు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ ఇచ్చేవారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పులివెందులలో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రేషన్ డీలర్లు తమకు వచ్చిన స్టాక్‌ను ఎండియు వాహనదారులకు ఇవ్వకుండా అరకొరగా, సమయ పాలన లేకుండా తూతూ మంత్రంగా పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నత అధికారులు స్పందించి రేషన్ బియ్యం ఇంటి ఇంటికి పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

20 నుంచి కార్మికుల సమ్మె అనివార్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు: రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సంఘం పిలుపుమేరకు ఈనెల 20 నుండి 22వ తేదీ వరకు సమ్మె అనివార్యమని కార్మిక సంఘ నాయకులు తెలిపారు. ఆ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మున్సిపల్ సంఘ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్ మాట్లాడుతూ లేబర్ కోడ్ రద్దు చేయాలన్నారు. ఆప్కాస్ రద్దు ప్రతిపాదనను విరమించుకొని ఏజెన్సీలకు అప్పజెప్పకూడదన్నారు. ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులకు కోవిడ్ కార్మికులకు జిఒ నెంబర్ 36 ప్రకారం జీతాలు ఇవ్వాలన్నారు.

సాంకేతికతను ఉపయోగించుకోవాలి

ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు పి.వి.సత్యనారాయణ

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

చిన్న, సన్న కారు రైతులు సాంకేతికతను అందిపుచ్చుకొని అధిక దిగుబడులు సాధించే విధంగా వినియోగించుకోవాలని ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయ లాం గుంటూరు పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ పేర్కొన్నారు. దక్షిణ మండలి వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం మంగళవారం ఊటుకూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా, నానో డిఎపి సమర్థ స్థాయి పరిశీలించాలని, పరిశోధనా ఫలితాలను త్వరితగతిన వెల్లడించడం ద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రభుత్వానికి సబ్సిడీ భారం తగ్గించాలని చెప్పారు. భూమి, వాయు, నీటి కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడగలమని ఆకాంక్షను వ్యక్తం చేశారు. పురుగు మందుల అవశేషాలను ఆహార ధాన్యాలు, కూరగాయలు పండ్లలో త్వరగా నిర్ధారించే పద్ధతులను గుర్తించి అందుకనుగుణంగా పురుగు మందుల అవశేషాలను నిర్మూలించే పరిశోధనలను వేగంగా పూర్తి చేయాలని శాస్త్రవేత్తలను ఆదేశించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ సమావేశానికి శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు, రైతులు కీలక భాగస్వాములు కనుక ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పటిష్ఠమైన కార్యాచరణ ప్రణాళిక కోసం తమ విలువైన సూచనలు ఇవ్వాలని కోరారు. కీటక శాస్త్రం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి ప్రధాన శాస్త్రవేత్త మురళీకృష్ణ మాట్లాడుతూ పురుగు మందుల అవశేష నిర్మూలన పద్ధతులు అడివి పందుల యాజమాన్యం గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం, ఊటుకూరు, ప్రభాకర్ రెడ్డి, ఏరువాక కేంద్రం, ఊటుకూరు, సమన్వయకర్త అంకయ్య కుమార్, కృషివిజ్ఞాన కేంద్రం, ఊటుకూరు సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, శాస్త్రవేత్తలు డా.కె.సునీల్ కుమార్, డాక్టర్ మధురి, డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ భావతప్రియ, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ వి.శిల్పకళ, డాక్టర్. టి.మహేష్ బాబు, కె. సాయి మహేశ్వరి, యస్.మానస, ఐ.సురేష్ కుమార్ రెడ్డి ఐదు జిల్లాల పరిశోధన, విస్తరణ కేంద్రాల శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయాధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, పరిశోధన విస్తరణ సలహా మండలి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

అంతర్జాతీయ స్థాయిలో 'అన్నమాచార్య' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకున్నారని యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ సాయిబాబారెడ్డి పేర్కొన్నారు. మార్చి 30, 31 తేదీల్లో చెన్నైలోని సెయింట్ జోసెఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన "ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్నోవేషన్స్ ఇన్ మెటీరియల్స్ సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ (ఐఎంఎస్‌టిఇఎం -2025) అనే అంతర్జాతీయ సదస్సులో వీరు పాల్గొని 'యాన్ ఇమేజ్ ఎన్‌క్రిప్షన్ అల్గోరితం బై యూసింగ్ సెక్యూర్‌కీ జనరేషన్ టెక్నిక్స్' అనే శోధనా పత్రాన్ని సమర్పించిన బృందం యు.జి విద్యార్థుల విభాగంలో 'బెస్ట్ పేపర్ ప్రెజెంటేషన్ అవార్డు' పొందారని చెప్పారు. మొత్తం 226 పత్రాలలో వీరి పత్రం అత్యుత్తమంగా ఎంపిక కావడం విశేషమని చెప్పారు. విజేతలుగా నిలిచిన ఈ బృంద సభ్యులు జి.దామోదర్, ఎం.గిఫ్ట్, వై.బ్రహ్మతేజ వాణి అచారి, పి. బాషాను, వారికి మార్గదర్శకురాలిగా నిలిచిన అసోసియేట్ ప్రొఫెసర్ రియాజ్ భానులను మంగళవారం అన్నమాచార్య కళాశాలలో ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్, ప్రిన్సిపల్ ఎస్.ఎం.వి నారాయణ, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, వారి భవిష్యత్తు విజయానికి శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి విజయాలు మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు.

కౌమార బాలికలకు అవగాహన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కూచివారి పల్లె గ్రామ పంచాయతీలోని ఎన్‌టిఆర్ కాలనీలో మహిళా పోలీసులు పావని, రోజా, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుబ్బలక్షుమ్మ ఆధ్వర్యంలో మంగళవారం కౌమార బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌమార బాలికల సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతుందని తెలిపారు. కౌమార బాలికల సాధికారత లక్ష్యంగా వేసవి సెలవులలో ఈ నెల 2 నుండి జూన్ 10 వరకు వివిధ శిక్షణా కార్యక్రమాలను కౌమార బాలికలకు అందిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఇందులో భాగంగా కౌమార బాధితులకు విద్య యొక్క ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణా, ఫోక్సో చట్టం, బాల్యవివాహాల నిషేధ చట్టం, ఆత్మరక్షణ, యోగా, జీవనోపాధి అవకాశాలు, సైబర్, ఆన్‌లైన్ భద్రత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాల గురించి వివరించారు. కౌమార బాలికలపై విషయాలు అవగతం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, కౌమార బాలికలు పాల్గొన్నారు. **సుండుపల్లి :** మండలం, రాయవరం గ్రామంలోని సచివాలయంలో కిషోర బాలికల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్ వైజర్ సుశీలమ్మ మాట్లాడుతూ బాలికలు రుతు క్రమ సమయంలో ఎన్నో జాగ్రత్తలు పాటించాలని, అలాగే చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. అనంతరం రెడ్స్ సంస్థ సిఎస్‌డబ్ల్యూఎస్. వెంకటయ్య మాట్లాడుతూ పిల్లలును పాఠశాల పరిధిలో కానీ, ఇతర ప్రదేశ్ లలో కానీ హేళన చేయడం, వారిని లైంగికంగా వేధించడం చేయరాదని సూచించారు. **బి.కొత్తకోట :** ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని బడికాయలపల్లి సచివాలయంలో కిశోరి వికాసం, వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండవ రోజైన మంగళవారం రుతుక్రమ పరిశుభ్రత, లైంగిక విద్యపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఒ భాగ్యమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ హిజాద్ ప్యారి, ఎఎన్‌ఎం, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడి కార్యకర్తలు. కిశోరి బాలికలు పాల్గొన్నారు. **రామాపురం:** మహిళా హక్కులు, చట్టాలపై 14 నుండి18 వయసు నుంచే కిషోర్ బాలికలు అవగాహన పెంచుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హుస్సేనమ్మ, సరస్వతిపల్లి జిఎం ఎస్.కె.మౌనిక అన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీ కొండవాండ్లపల్లి అంగన్వాడీ కేంద్రం, సరస్వతి పల్లె పంచాయతీ ఉడుం వారిపల్లిలో బుధవారం అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థినులకు కిషోర్ బాలికల వికాసంపైనా, మహిళా హక్కులు, చట్టాలు రక్తహీనత ఆరోగ్యపరమైన సమస్యలపైనా వివరించారు. ఎలాంటి పౌష్టికా ఆహారం తీసుకోవాలి అనే అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామాలలో అవ్వ తాతలు మనవరాలు పెళ్లి చూడాలని చిన్న వయసులోనే పెళ్లిల్లు చేస్తుంటారని, ఆడపిల్లకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్ల వయసులోపు పెళ్లిళ్లు చేస్తే చట్టరీత్యా నేరమని చెప్పారు. ఆడపిల్లలు తమ భవిష్యత్తుపై లక్ష్యాలను నిర్ణయించుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రహజాన్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటిలో విద్యార్థులు ధర్నా

ఫీజు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇచ్చేదిలేదన్న అధికారులు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో విద్యార్థులు మంగళవారం ధర్నాకు దిగారు. ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటిలో ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అధికారులు చెప్పిన ఫీజులు తాము చెల్లించాలేమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇడుపులపాయలో నిర్వహించే ఆర్కేవ్యాలీ, ఒంగోలు ట్రిపుల్‌ఐటి విద్యార్థులు దాదాపు 8 వేల మంది విద్యను అభ్యసిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు సెమిష్టర్ 2 పరీక్షలు అయిపోయాయి. 4 రోజుల్లోగా క్యాంపస్ నుండి వెళ్లి పోవాలని విద్యార్థులకు అధికారులు సూచించారు. ఈ క్రమంలో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు తమకు తొందరలో సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరగా, ఫీజు బకాయిలు మొత్తం చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పడంతో ఆందోళనకు గురైనట్లు తెలిపారు. విద్యార్థుల వద్దకు పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ వెళ్లి డైరెక్టర్ సెలవులో ఉన్నారని, బుధవారం ఆయనను కలిసి సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థులు సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు.



ధర్నా చేస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

ప్రయివేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

-కృస్మా అధ్యక్షులు లెక్కల జోగిరామిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షులు లెక్కల జోగిరామిరెడ్డి కోరారు. మంగళవారం డిఇఒ షంషుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోగిరామిరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 3న ప్రయివేట్ పాఠశాలల ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారని చెప్పారు. పలు అభ్యంతరాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. అవసరమైన మార్పులు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మూడు నెలలు గడిచిన మార్పులు లేకుండా ఫార్మ్ - 1 నింపమని ప్రొసీడింగ్ ద్వారా తెలియజేశారని చెప్పారు. ఇది తమకు అసంతృప్తిగా ఉందని తెలిపారు. మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం మార్పులు చేసిన తరువాత మాత్రమే త పాఠశాలలు ఫార్మ్ - 1 నింపుతామని చెప్పారు. ప్రస్తుతం డిఎస్‌సి పరీక్షల కారణంగా తమస్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మెమోలు తీసుకుని కోచింగ్ కోసం వెళ్లారని పేర్కొన్నారు. టీచర్ల వివరాలు ఆన్‌లైన్‌లో నింపడం కష్టంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మినహాయింపులు అసంబద్ధంగా ఉండడంతో తాము కోర్టును ఆశ్రయించామని తెలిపారు. కార్యక్రమంలో కృస్మా ట్రెజరర్ రామాంజనేయరెడ్డి, ఉపాధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి నాగేశ్వర్ రెడ్డి, సాధన శ్రీనివాసులు, బద్వేల్ కృస్మా ప్రెసిడెంట్ కుమార్, లక్ష్మీ విద్యారణ్య కరస్పాండెంట్ శంకర్ రెడ్డి, మహేశ్వరి హై స్కూల్ కరస్పాండెంట్ మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస హై స్కూల్, బ్లూ బెల్స్ హై స్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి, ప్రగతి హై స్కూల్ కరస్పాండెంట్ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సులభమైన పద్ధతిలో ఆంగ్ల వ్యాకరణం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని కొండాయపల్లిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ కార్యదర్శి అమీరుద్దీన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో సులభమైన పద్ధతిలో ఆంగ్ల వ్యాకరణాన్ని ఎలా నేర్చుకోవాలి అనే పాఠాన్ని ఆంగ్ల ఉపాధ్యాయులు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ డి.రూత్ ఆరోగ్య మేరి బోధించారు. సులభమైన పద్ధతిలో ఆంగ్ల వ్యాకరణం విద్యార్థుల కోసం ఈ వేసవి శిబిరంలో నేర్పిస్తున్నారు. విద్యార్థులకు ఆంగ్ల వ్యాకరణం ప్రాముఖ్యత గురించి కొన్ని ముఖ్యమైన విషయాలను తెలియజేశారు. స్పష్టమైన కమ్యూనికేషన్ కొరకు మంచి వ్యాకరణం విద్యార్థులకు వారి ఆలోచనలు, అభిప్రాయాలను మాట్లాడడంలో, రాయడంలో స్పష్టంగా కచ్చితంగా వ్యక్తిగరించడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. సమర్థవంతమైన రచన చేయుటకు బాగా నిర్మాణాత్మకమైన వ్యాసాలు నివేదికలు, ఇతర విద్యా సంబంధిత పనులు రాయడానికి బలమైన వ్యాకరణం ప్రాథమికమైనదని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రెరియన్ పవన కుమార్, సుబ్రహ్మణ్యం, జేమ్స్, గౌస్, సుబ్బమ్మ, రమణ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - వేంపల్లె : ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలు పొందాలని అధ్యాపకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంగళవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్ ప్రవేశాల నిమిత్తం హెచ్‌ఎం చెరుకూరి శ్రీనువాసులు ఆధ్వర్యంలో అధ్యాపకులు ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ కళాశాలలో చేరితే విద్యార్థులకు కలిగే వసతులు, సౌకర్యాలను వివరించారు. బైపిసి, సిఇసి గ్రూపులు ఉన్నట్లు చెప్పారు. సెక్షన్లకు 20 మంది విద్యార్థులు చొప్పున రెండు గ్రూపులు కలిపి 40 మందికి సీట్లు కేటాయించామన్నారు. ఇప్పటికే రెండు గ్రూపులో కలిపి 20 మంది విద్యార్థులకు అడ్మిట్ కార్డులు అందజేసినట్లు చెప్పారు.



వాల్మీకిపురం : విద్యార్థులను ప్రోత్సహిస్తున్న గ్రంథాలయ అధికారి రమాపతి

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికే ప్రభుత్వం ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిందని, ఈ శిబిరాలకు విద్యార్థుల నుండి విశేష స్పందన లభిస్తోందని మదనపల్లె శాఖ గ్రంథాలయ అధికారిణి ఆర్.వసంత కుమారి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 28న ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరం ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగుతోందన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 11 గంటల వరకు ప్రతిరోజు తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొంటున్నారన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు రెడ్డెప్ప స్పోకెన్ ఇంగ్లీష్, మదన్ మానవతా విలువలు, క ృష?మూర్తి మ్యాథమెటిక్స్,చంద్రకళ డ్రాయింగ్, బయాలజీ, రమణమ్మ భగవద్గీత అంశాలను నేర్పించడం జరుగుతోందన్నారు. ఈ శిక్షణ శిబిరానికి హాజరవుతున్న విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్నామన్నారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల వేసవి సెలవులను వృథా చేసుకోకుండా ఈ శిక్షణ శిబిరానికి పంపించాలని కోరారు. ఈ అవకాశాన్ని మదనపల్లి పట్టణ విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. **వాల్మీకిపురం:** వేసవిలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి రమాపతి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్స్ అందించి, ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సందర్శించి, విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్వీన్ సుల్తాన, పాల్గొన్నారు.

బాధ్యతగా గర్భిణుల గుర్తింపు నమోదు

ప్రజాశక్తి-పీలేరు

గర్భిణులను గుర్తించి వారి పేర్ల నమోదుతో పాటు వారికి పుట్టే బిడ్డకు ఏడాది వయస్సు వచ్చేవరకు వారి పర్యవేక్షణ బాధ్యత ఆశ, ఆరోగ్య సిబ్బందిపై ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. మంగళవారం "ఆశడే" సందర్భంగా పీలేరు మండలం, రేగళ్లప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి విధి నిర్వహణ అంశాలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆశ కార్యకర్త ప్రతీ గర్భవతిని నమోదు చేసినప్పటి నుండి బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు వారికి ఆరోగ్య సేవలు అందిస్తూ వారి ఆరోగ్య సంరక్షణ కోసం పాటుపడాలన్నారు. ఈ-ఆశ యాప్ ప్రతి ఒక్క ఆశ డౌన్లోడ్ చేసుకుని, ఆరోగ్య సేవలు నమోదు చేయాలని చెప్పారు. ప్రతి గర్భిణి 12 వారలలోపు నమోదు చేసుకుని అన్ని సేవలను సకాలంలో అందించి, ఆర్.సి.హెచ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని, ప్రమాదకర గర్భిణులను తొందరగా గుర్తించి వారిని సక్రమంగా ఫాలోఅప్ చేసి తల్లి బిడ్డలను కాపాడాలని, ఎన్.సి.డి 3.0 సర్వే పెర్సెంటేజీని పెంచాలని ఆదేశించారు. అన్ని రకాల టీకాలను కచ్చితంగా యు.డబ్ల్యు.ఐ.ఎన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, ఈ నెలలో ఎండలు ఎక్కువగా ఉన్నందున వడ దెబ్బ నివారణ చర్యల గురించి ప్రజలుకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసన్న, సిహెచ్‌ఓ జయలక్ష్మి, సూపర్వైసర్ రాజీమణి, ఆరోగ్యకార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, పిహెచ్సి సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటో డ్రైవర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

గుర్తు తెలియని వ్యక్తులు ఆటో డ్రైవర్‌పై దాడి చేసే గాయపరిచిన సంఘటన సోమవారం రాత్రి మండలంలో జరిగింది. స్థానిక ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపిన వివరాల మేరకు... రాయచోటి మండలం, అబ్బవరం పంచాయతీ, ఇందుకూరుపల్లికి చెందిన చదవల బాలాజీ, నిమ్మనపల్లి మండలం బండ్లపై గ్రామానికి చెందిన ఉషారాణితో 15 సంవత్సరాలకు ముందు పెద్దల సమక్షంలో వివాహం జరిగిందన్నారు. వీరికి కుమారుడు మనోజ్ (12), కుమార్తె స్వప్న (10) అనే ఇద్దరు సంతానం ఉన్నారు. బాలాజీ రాయచోటిలో ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు మొదలయ్యాయి. భార్య తన పుట్టింటికి వచ్చేయగా, భర్త తన ఇద్దరు పిల్లలతో తన ఇంటి వద్ద ఉంటున్నారు. 15 రోజులకు ముందు భర్త తన భార్యకు ఫోన్ చేసి భార్య పుట్టినిల్లు అయిన బండ్లపైలోనే ఇద్దరం కలిసి ఉంటూ ఏదో ఒక పని చేసుకుని బ్రతుకుందామని చెప్పి, భర్త తన ఇద్దరు పిల్లలతో కలిసి బండ్లపైకి వచ్చేశారు. సోమవారం రాత్రి బాలాజీ తన భార్య ఉషారాణితో కలిసి ఊరికి సమీపంలో బహిర్భూమికి వెళ్ళగా, ఇదే సమయంలో కొంతమంది వ్యక్తులు బాలాజీ తలపై రాళ్లతో, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితులు బిగ్గరగా అరవడంతో దాడికి పాల్పడిన వ్యక్తుల అక్కడి నుంచి పారిపోయారు. కుటుంబ సభ్యుల సహాయంతో గాయపడిన బాలాజీని మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. బాధితుడు తల్లి చదవల రామక్క ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ తిప్పేస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అప్పులబాధతో భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అప్పులబాధతో భవన నిర్మాణ కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 20 రోజులు అనంతరం ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. కుళ్ళిపోయిన స్థితిలో మృతదేహం ఉండడంతో పాటు, దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగు చూసింది. తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. పెద్దమండ్యం మండలం, చెరువుకింద పల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు చలపతి (38) భార్య గంగారాణి, ఇద్దరు పిల్లలతో కలిసి ఆరు నెలల క్రితం మదనపల్లె, నీరుగట్టువారిపల్లెకు వలస వచ్చాడు. ఇక్కడే అద్దె ఇంట్లో ఉంటూ భవన నిర్మాణ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. భార్య గంగారాణి హోటల్లో పని చేసేది. వీరికి ఇద్దరు పిల్లలు కాగా వారిని ప్రభుత్వ హాస్టల్లో చేర్పించి చదివించుకుంటున్నారు. చలపతి అప్పుల ఊబిలో కూరుకు పోయాడు. మద్యం తాగే అలవాటు ఉండటంతో తరచూ ఇంట్లో భార్య భర్తల మధ్య గొడవలు జరిగేవి. 20 రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లిపోయిన చలపతి కాట్లాటపల్లి రోడ్డులో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బయటకు వెళ్లిన భర్త ఇంటికి రాకపోవడంతో భార్య గంగారాణి తమ స్వగ్రామం చెరువుకిందపల్లిలో, బంధువుల ఇళ్లల్లో, తెలిసిన వారి వద్ద ఇలా పలుచోట్ల గాలించారు. ఎక్కడ ఆచూకీ తెలవక పోవడంతో ఇంట్లో గొడవపడి ఎక్కడైనా దూరంగా పనికి వెళ్లిపోయింటాడని మిన్నకుండిపోయారు. ఈ నేపథ్యంలో కట్లాటపల్లి రోడ్డు వద్దని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ కళా వెంకటరమణ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అతని జేబులో ఉన్న సెల్ ఫోన్ ఆధారంగా మేస్త్రి రమణ ద్వారా మ ృతుడి ఆచూకీ తెలుసుకున్నారు. మృతుడి భార్య, తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకొని గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ఊటుకూరు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఊటుకూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరాజు (48) అక్కడికక్కడే మృతి చెందాడు. ఊటుకూరు నుండి రాజంపేట పట్టణానికి ద్విచక్ర వాహనంపై వస్తున్న శ్రీనివాసరాజును తిరుపతి వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. పంచనామా నిమిత్తం రూరల్ పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఊటుకూరు మలుపు నుండి భువనగిరిపల్లి ముఖద్వారం వరకు ప్రతినెలా కనీసం ఒకటి, రెండు రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా ప్రకటించి స్పీడ్ బ్రేకర్లు లేదా భారీకేడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.